క్లుప్తంగా

బీమా సొమ్ము అందజేత



మచిలీపట్నంటౌన్: 13వ డివిజన్ బచ్చుపేటకు చెందిన చింతాడ సత్యవతి ఇటీవల మృతిచెందింది. వైఎస్సార్ బీమా పథకం ద్వారా మట్టి ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ. 10 వేలను మంగళవారం ఆమె భర్త సత్యనారాయణ కు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ సుభాషిణి, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జ్ గాజుల భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

చెరువు పాడుకుని డబ్బు చెల్లించలేదని ఫిర్యాదు

పెడన: చెన్నూరులో పంచాయతీకి చెందిన 11 ఎకరాల చెరువును వేలంపాటలో పాడుకుని నిర్ణీత గడువులోగా డబ్బులు చెల్లించలేదని సదరు పాటదారునిపై పంచాయతీ కార్యదర్శి షేక్ అహ్మద్ పెడన పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెన్నూరు గ్రామానికి చెందిన యర్రంశెట్టి దేవేంద్రప్రసాద్ 11 ఎకరాల చెరువును మూడేళ్ల లీజుకు పంచాయతీ వేలం పాట ద్వారా పాడుకున్నారు. రూ.16 లక్షలకు గాను ఇంకా రూ.4.36 లక్షలు మార్చి 2023లోగా చెల్లించాల్సి ఉంది. రూ.4.36 లక్షలు పలు దఫాలుగా చెల్లించాలని కోరినా ఫలితం లేకపోవడంతో ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి పెడన పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రవిచంద్రకుమార్ తెలిపారు.

పేదలకు వస్త్రదానం



మచిలీపట్నంటౌన్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని అజ్మీర్ బాబా సేవా సమాజం ఆధ్వర్యంలో వర్రెగూడెంలోని సేవా సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్‌పీర్, ప్రతినిధులు పేద మహిళలకు వస్త్రాలను మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యుడు నాగలింగం నాగేశ్వరరావు, రవి, సయ్యద్‌బాజీ, షారుక్, షేర్‌అలీ, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారావు మృతికి సంతాపం

మచిలీపట్నంటౌన్: మునిసిపల్ విశ్రాంత ఉద్యోగి ధనికొండ సుబ్బారావు (83) మంగళవారం తెల్లవారుజామున మృతిచెందారు. నారాయణపురంలోని స్వగృహం వద్ద ఉన్న సుబ్బారావు మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గూడవల్లి నాగరాజు, కార్పొరేటర్లు పరింకాయల విజయ్‌చంద్రకుమార్, మాచవరపు రాంప్రసాద్, జోగి చిరంజీవి, కాగిత జవహర్‌లాల్, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, మాజీ కౌన్సిలర్ చిటికిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా కిట్లు పంపిణీ



కోడూరు: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని స్థానిక వంతెన సెంటర్‌లోని మినార్ మసీదులో 70 ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ రఫీ ఆర్థిక సాయంతో ఒక్కొక్కరికి రూ.1100 విలువైన బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలను అందించారు. ఈ సందర్భంగా దాత రఫీని మసీదు కమిటీ ఘనంగా సత్కరించింది. మసీదు నిర్మాణానికి కూడా రఫీ ఆర్థిక సహాయం అందించారని కమిటీ సభ్యులు తెలిపారు.

తల్లిపై కుమారుడు, కోడలు దాడి

కోనేరుసెంటర్: పెన్షన్ డబ్బుల కోసం తల్లిపై దాడికి పాల్పడుతున్న కుమారుడు, కోడలిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచిలీపట్నం లక్ష్మణరావుపురానికి చెందిన తంటేపూడి విక్టోరియా ఉపాధ్యాయినిగా పనిచేస్తూ పదవీ విరమణ చేసింది. ఆమె కుమారుడు నటరాజ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ కరోనా తరువాత ఇంటి వద్దే ఉంటూ ఉద్యోగం చేసుకుంటున్నాడు. వీరంతా కలిసి ఉంటున్నారు. పదవీ విరమణ చేసిన విక్టోరియా ప్రతి నెలా వచ్చే పెన్షన్ డబ్బులను తన కూతుళ్లకు ఇచ్చేస్తుందనే అనుమానంతో కుమారుడు నటరాజ్, అతని భార్య విద్యాధరిలు ఆమె వద్ద ఉన్న ఏటీఎం కార్డును బలవంతంగా తీసుకోవడంతో పాటు పెన్షన్ డబ్బులు ప్రతి నెలా తనకే ఇవ్వాలంటూ బెదిరిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆమెపై పలుమార్లు కర్రతో దాడి చేశాడు. కొడుకు, కోడలు వేధింపులు లాళలేక బాధితురాలు మంగళవారం మచిలీపట్నం పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నటరాజ్, అతని భార్యను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం వారిని కోర్టుకు తరలించామని సీఐ రవికుమార్ తెలిపారు.

పేదల ఆర్థికాభ్యున్నతే లక్ష్యంగా పాలన

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- ఉల్లిపాలెం, హంసలదీవి పంచాయతీల్లో గడప గడపకు మన ప్రభుత్వం
- ఇంటింటికి వెళ్లి పథకాలు వివరించిన రమేష్‌బాబు



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు



సంగమం ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

కోడూరు: పేదల ఆర్థికాభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మంగళవారం మండలంలోని ఉల్లిపాలెం సచివాలయ పరిధిలోని శ్రీరామపురం, పర్చూరివారిపాలెం, ఉల్లిపాలెం, హంసలదీవి, పాలకాయతిప్ప గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 7 గంటలకే రమేష్‌బాబు, యువ నేత వికాస్‌లు శ్రీరామపురం చేరుకొని వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో కలిసి 660 ఇళ్లను సందర్శించారు. నాలుగేళ్లలో ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని వివరించి బుక్‌లెట్లను అందించారు. కులమతాలు, పార్టీలు, వర్గాలకు అతీతంగా అర్హత ఉంటే సంక్షేమ పథకం నేరుగా లబ్ధిదారుడి గడప వద్దే వస్తుందని, అవినీతికి ఆస్కారం లేకుండా నగదును కూడా లబ్ధిదారుడి బ్యాంక్ ఖాతాకే జమ చేస్తున్నామని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని ప్రతి ఇంటి వద్ద ప్రజలు చెప్పడం ప్రభుత్వ పాలనకు అద్దం పడుతోందన్నారు.

మత్స్యకార గ్రామాల్లో అపూర్వ ఆదరణ..

సముద్ర తీరానికి అనుకొని ఉన్న పాలకాయతిప్ప, హంసలదీవి మత్స్యకార గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి అపూర్వ ఆదరణ లభించింది. ప్రతి ఇంటి వద్ద గ్రామస్తులు రమేష్‌బాబు, వికాస్‌లకు స్వాగతం పలుకుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. వేట నిషేధ సమయంలో ప్రభుత్వం తమకు అండగా నిలిచి నిషేధ భృతి అందిస్తోందని మత్స్యకారులు రమేష్‌బాబు వద్ద తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. గంగపుత్రులకు ప్రభుత్వం అన్ని వేళలా అండగా ఉంటూ అనేక పథకాలను అమలు చేస్తోందని, వీటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని రమేష్‌బాబు కోరారు. బీచ్‌కు వచ్చే పర్యాటకులను కూడా ఆకర్షించే విధంగా గ్రామంలో మత్స్యసంపదకు సంబంధించిన స్టాల్స్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. స్టాల్స్ ఏర్పాటుకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని చెప్పారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, సర్పంచ్‌లు వెర్రి పావని, కొక్కిలిగడ్డ భిక్షాలు, శ్రీనివాసరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ కటకం కుటుంబరావు, సచివాలయ కన్వీనర్లు, మత్స్యకార నేతలు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

సాగర సంగమం వద్ద బారికేడింగ్..

కోడూరు: కృష్ణానది సముద్రంలో కలిసే పవిత్ర కృష్ణా సాగర సంగమం వద్ద కట్టుదిట్టమైన బారికేడింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆదేశించారు. మంగళవారం వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి పాలకాయతిప్ప బీచ్, సంగమ ప్రాంతాలను రమేష్‌బాబు పరిశీలించి మాట్లాడారు. సంగమం వద్ద ఊహకందని లోతు ఉండడం వల్ల పర్యాటకులు ప్రమాదాల బారిన పడుతున్నారని, ఇటీవల పెనమలూరుకు చెందిన యువకుడు కూడా ఈ ప్రాంతంలో ప్రమాదవశాత్తు మరణించడం దురదృష్టకరమన్నారు. సంగమం వద్ద సుడిగుండాలు ఏర్పడడం వల్ల లోతు తీవ్రత పెరుగుతోందని, ఇక్కడ బారికేడింగ్ ఏర్పాటు చేసి పర్యాటకులకు అవగాహన కల్పించాలని సూచించారు. సంగమం లోపలికి వెళ్లకుండా ఐరన్ దిమ్మలు, ఫెన్సింగ్‌తో పటిష్ట చర్యలు తీసుకొని బీచ్, సంగమ ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. కోడూరు పోలీసులు, పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు తీరం ప్రాంతంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. సంగమం వద్ద కృష్ణమ్మ పాదాలు, విగ్రహాలకు కూడా రక్షణ కల్పించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

బంటుమిల్లి: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, బంటుమిల్లి జూనియర్ సివిల్ జడ్జి ఈ. సుధాకర్ అన్నారు. మంగళవారం మల్లేశ్వరం సచివాలయం వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ గ్రామాల్లో భూముల అమ్మకాలు, ఆర్థిక లావాదేవీల విషయంలో రాత పత్రాలు నిబంధనల మేరకు ఉండాలని, అవగాహన ఉన్నవారితో పత్రాలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. పదిహేను సంవత్సరాల లోపు పిల్లలు ఏ తప్పు చేసినా అందుకు తల్లిదండ్రులు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదాలు చేస్తే అందుకు తల్లిదండ్రులు బాధ్యత వహించాల్సి ఉందని హెచ్చరించారు. మైనర్లు పాఠశాలల్లో ఉండాలని, వారిని కూలి పనులకు పంపరాదని చెప్పారు. ఈ సందర్భంగా పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ సీహెచ్ శ్రీనివాసరావు, ఏజీపీ ఈవీఎస్ రాయుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. సోమశేఖర్, న్యాయవాదులు ఎస్. అశోక్‌కుమార్, ఎస్. సురేష్, టి. సురేష్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు సాలెంపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

కోడూరు: మండలంలోని సాలెంపాలెం సచివాలయ పరిధిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీఓ పాండురంగారావు మంగళవారం తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పాల్గొని ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వివరిస్తారన్నారు. అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని సూచించారు.

‘జగనన్నే మా భవిష్యత్తు’కు ప్రజాదరణ



కోకనారాయణపాలెం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ మధుసూదనరావు తదితరులు



చినగొల్లపాలెం కార్యక్రమంలో బాపూజీ, తదితరులు



బందరు మూడో డివిజన్‌లో కరపత్రాలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ శీలం భారతి, బాబ్జీ

గూడూరు: వైఎస్సార్ సీపీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజాదరణ లభిస్తోంది. మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ నియోజకవర్గాల్లో పలుచోట్ల వైఎస్సార్‌సీపీ శ్రేణులు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గూడూరు మండలం కోకనారాయణపాలెం గ్రామంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పథకాల అమలుపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ వారు అందించిన స్టిక్కర్లను ఆనందంగా తీసుకుని ఇళ్లకు అంటించుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు గరికిపాటి వెంకటరామానాయుడు, మాజీ సర్పంచు సురేష్, ఆర్‌బీకే చైర్మన్ శివ, రత్నారావు, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- కృత్తివెన్ను: సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి పాలనాదక్షుడని పలువురు నాయకులు అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం మండలంలో మంగళవారం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి వారి అనుమతితో జగనన్న స్టిక్కర్‌ను అతికించి, ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించారు. జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, పార్టీ మండల కన్వీనర్ వెంకట్రాజు, మండల సచివాలయాల కన్వీనర్ కొక్కిలిగడ్డ బాపూజీ తదితరులు పాల్గొన్నారు.
- మచిలీపట్నంటౌన్: మూడో డివిజన్‌లో కార్పొరేటర్ శీలం భారతి, మాజీ కౌన్సిలర్ శీలం బాబ్జీ ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. 11వ డివిజన్‌లో జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు గూడవల్లి నాగరాజు, ఎంయూడీ వాహనాల నిర్వాహకుల సంఘం జిల్లా అధ్యక్షుడు పిండి శ్యాంబాబు, కార్యకర్తలు, 40వ డివిజన్‌లో పార్టీ నాయకుడు గోళ్ల నాగరాజు, పళ్లెం కల్యాణ్, తరకటూరి సీతారాములు, గోళ్ల రంగ తదితరులు కరపత్రాలు పంచారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు మాట్లాడుతూ గత టీడీపీ పాలకులకు, జగన్ ప్రభుత్వానికి ఉన్న తేడాను వివరించి కరపత్రాలు అందించారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి మోసం చేయగా జగన్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనే కాకుండా మరిన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తుండటంతో తమ కుటుంబ జీవనం మెరుగుపడిందని పలువురు మహిళలు ఆనందం వ్యక్తంచేశారు.

లక్ష్య సాధనకు కఠోర శ్రమ అవసరం

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- ఘనంగా కోడూరు జెడ్పీ పాఠశాల వార్షికోత్సవం



ఉత్తమ విద్యార్థి పురస్కారాన్ని అందిస్తున్న రమేష్‌బాబు, నరసింహారావు, వికాస్

కోడూరు: ప్రతి విద్యార్థి తాను ఎంచుకున్న లక్ష్యాన్ని అధిగమించాలంటే కఠోర శ్రమ ఎంతో అవసరమని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. కోడూరు చామర్తి ప్రకాశరాయ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. పాఠశాల హెచ్‌ఎం ఆలా వెంకట రమణ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎమ్మెల్యే రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ కన్వీనర్ కడవకొల్లు నరసింహారావు, యువ నేత సింహాద్రి వికాస్‌లు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను ప్రభుత్వం సమకూరుస్తోందని, క్రమ శిక్షణతో చదివి ఉన్నతస్థానాలకు చేరుకోవాలని సూచించారు. పాఠశాల ఉత్తమ విద్యార్థి పురస్కారాన్ని పదో తరగతి విద్యార్థి ధనశేఖర్‌కు ఎమ్మెల్యే చేతుల మీదగా అందించారు. ధనశేఖర్ తల్లిదండ్రులను రమేష్‌బాబు సత్కరించారు. పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించారు. సంప్రదాయ దుస్తులతో విద్యార్థినులు చేసిన డ్యాన్సులు, భరతనాట్యం, భంగ్రా నృత్యాలు ఆకట్టుకున్నాయి. సినిమా పాటలకు నృత్యాలు, వివిధ రకాల స్కిట్స్‌తో విద్యార్థులు అలరించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, సర్పంచులు వెన్నా షైనీ, వెర్రీ పావని, ఎంపీటీసీలు బడే గంగాధరరావు, తిమ్మన నాంచారయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, ఎంఈఓ టీవీఎం రామదాసు పాల్గొన్నారు.

వరికుప్పలకు నిప్పు పెట్టిన దుండగులు

2.10 ఎకరాల్లో వరి పంట దగ్ధం



దగ్ధమైన వరికుప్ప

కోడూరు: రైతు ఆరుగాలం కష్టపడి పండించిన వరిపంటకు గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. ఈ ఘటన కోడూరు మండలంలో సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మండలంలోని లింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన చిట్టిప్రోలు రాజ్‌కుమార్ అదే గ్రామంలో ఆరు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని ఖరీఫ్ సీజన్‌లో వరిపంటను సాగు చేశాడు. పంట చేతికి రావడంతో ఈ ఏడాది జనవరి నెలలో రాజ్‌కుమార్ వరికోత కోసి ఆరు ఎకరాల్లోని పంటను ఐదు వరికుప్పలుగా వేశాడు. అనంతరం రబీ పంటలో మినుము సాగు చేయగా ఇటీవల కాయతీత పూర్తి చేశాడు. మరో రెండు రోజుల్లో వరికుప్పలను నూర్పిడి చేసేందుకు ఏర్పాటు చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో సోమ వారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు రాజ్‌కుమార్‌కు సంబంధించిన రెండు వరికుప్పలకు నిప్పు పెట్టారు. మంగళవారం ఉదయం విషయం తెలుసుకున్న రాజ్‌కుమార్ ఘటనా స్థలానికి వెళ్లి చూడగా 2.10 ఎకరాలకు సంబంధించి వేసిన రెండు వరికుప్పలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సుమారు రూ.1.50 లక్షల మేర నష్టం వాటిల్లింది.

ఎమ్మెల్యే సింహాద్రి పరామర్శ..

రాజ్‌కుమార్ లింగారెడ్డిపాలెం పంచాయతీ నాలుగో వార్డు వైఎస్సార్ సీపీ సభ్యుడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, పార్టీ రైతు విభాగం రీజనల్ కన్వీనర్ కడవకొల్లు నరసింహారావు ఘటనాస్థలాన్ని పరిశీలించి బాధితుడిని పరామర్శించారు. విచారణ చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని రమేష్‌బాబు పోలీసులను ఆదేశించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

నాలుగేళ్లగా ఇదే విష సంస్కృతి..

లింగారెడ్డిపాలెం పంచాయతీలో నాలుగేళ్లుగా ఇలా వరికుప్పలకు నిప్పు పెట్టే విష సంస్కృతి నడస్తోంది. పంచాయతీ పరిధిలోని నక్కవానిదారి గ్రామంలో మూడేళ్లుగా పలువురు రైతుల వరికుప్పలకు గుర్తుతెలియని దుండగులు నిప్పు పెడుతూనే ఉన్నారు. ఈ ఏడాది లింగారెడ్డిపాలెం గ్రామంలో వరికుప్పకు నిప్పు పెట్టిన ఘటన దివిసీమ ప్రాంతంలో చర్చనీయాంశంగా మారింది.

అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖాధికారి ప్రసాద్

చల్లపల్లి: అగ్ని ప్రమాదాన్ని చిన్నగా ఉన్నపుడే నియంత్రిస్తే భారీ నష్టాలు తగ్గుతాయని అవనిగడ్డ అగ్నిమాపక శాఖాధికారి పీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. మంగళవారం స్థానిక సాయినగర్ వద్ద అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అపార్ట్‌మెంట్లు, కమర్షియల్ కాంప్లెక్స్‌లు, ఆస్పత్రుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు అక్కడ సిద్ధంగా ఉండే అగ్నిమాపక పరికరాల వినియోగంపై అవగాహన, నైపుణ్యం, ధైర్యం లేక ప్రమాదాల తీవ్రత పెరుగుతోందన్నారు. ఫైర్ సిబ్బంది వచ్చే లోపు భారీ నష్టం జరుగుతోందని చెప్పారు. అపార్ట్‌మెంట్లు, ఆస్పత్రుల్లో ఉండే సిబ్బందికి కనీస శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఇళ్లలో వంట గ్యాస్ సిలిండర్ లీకై మంటలు వ్యాపిస్తుంటే వెంటనే అదుపు చేసే విధానాన్ని వివరించి స్థానికులతో చేయించి వారిలో ధైర్యాన్ని నింపారు. కార్యక్రమంలో ఎల్‌ఎఫ్ జక్రయ్య, ప్రదీప్, శివ నాగరాజు, అంకినీడు ప్రసాద్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి

పెడన: జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని, అందుకు లబ్ధిదారులను ఈ వేసవిలో చైతన్యం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ డి. సుబ్బారావు అన్నారు. మంగళవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని సచివాలయాలకు చెందిన ఇంజినీరింగ్ సహాయకులతో జగనన్న ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. ఇళ్ల నిర్మాణానికి అడ్డంకులు ఏమైనా ఉన్నాయా అని వారిని అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి ఇబ్బందులు లేని చోట ఇప్పటికే చాలా ఇళ్ల నిర్మాణం ప్రారంభించారని, అవి త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈఓపీఆర్డీ ఎం. జయరాము, రూరల్ హౌసింగ్ ఏఈ మాధవి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

నాగాయలంక: స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో నిత్యాన్నదాన కమిటీ ఆధ్వర్యంలో 60 మంది వృద్ధులు, దివ్యాంగులకు మంగళవారం అన్నదానం చేశారు. గ్రామస్తులు వేములపల్లి హేమప్రసాద్, లక్ష్మీశివపార్వతి దంపతులు ఆర్థిక సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు.

మే 5న గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ

నాగాయలంక: గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో మే 5వ తేదీన మండవ వారి గంగమ్మ తల్లి పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ, జాతర మహోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ చైర్మన్ మండవ మధుసూదనరావు (బుజ్జి) మంగళవారం తెలిపారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయని, చివరిరోజు మే 7వ తేదీన అన్నసంతర్పణ జరుగుతుందని వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బంటుమిల్లి: బంటుమిల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ రవికుమార్ తెలిపారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గణపేశ్వరునికి పూజలు

గణపేశ్వరం(నాగాయలంక): గణపేశ్వరంలోని దుర్గా–గణేశ్వరస్వామి, పార్వతీ–సంగమేశ్వర స్వామి వార్ల కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం రెండో రోజు అర్చకుడు పోతుకూచి వెంకట నాగసాయిశర్మ విశేష పూజలు నిర్వహించారు. బుధవారం రుద్ర హోమం, పూర్ణాహుతి, కొట్నాలు, వసంతోత్సవం, త్రిశూల స్నానం, రాత్రికి రథోత్సవం, అన్నసమారాధన కార్యక్రమాలు జరుగుతాయని ధర్మకర్త రాంబాబు వివరించారు.

పలుచోట్ల చలివేంద్రాలు ప్రారంభం



బందరులో మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ పద్మ



మోపిదేవిలో మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ పద్మ

పెడన: బస్టాండు సమీపంలో 16వ వార్డు కౌన్సిలర్ రిజ్వానాబేగం, అబ్దుల్‌మాలిక్ సహకారంతో సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. మొదటి రోజు ద్రాక్ష రసం అందజేశారు. సహాయ ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా, ఉపాధ్యక్షుడు మామిడి ప్రసాద్, తాతా సాయిరాం, రౌతుల ప్రసాద్ పాల్గొన్నారు.

- మోపిదేవి: ఎండ తీవ్రతలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఉపయోగపడతాయని ఎస్‌ఐ పద్మ అన్నారు. మోపిదేవిలో అఖిల భారత యాదవ సంఘం అవనిగడ్డ నియోజకవర్గం ఇన్‌చార్జి గొరిపర్తి రవికాంత్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఎస్‌ఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ పద్మను సంఘం తరఫున సన్మానించారు. పంచాయతీ పాలకవర్గ సభ్యులు కొలుసు శివరాజేష్, గొరిపర్తి వీరరాఘవయ్య, గొరిపర్తి సత్యనారాయణ(కఠారి), పల్లపోతుల లయ హాసిని, డొక్కు గోపీ, బట్టు నాని బాలాజీ, కొలుసు శివకుమార్ పాల్గొన్నారు.
- మచిలీపట్నంటౌన్: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కమిషనర్ జి. చంద్రయ్య మంగళవారం ప్రారంభించారు. ప్రధాన రహదారిలో పాదచారుల దాహార్తి తీర్చేందుకు ఈ చలివేంద్రం ఏర్పాటు చేశామని సత్యసాయి సేవా సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్ తెలిపారు. డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు. తొలిరోజున పాదచారులకు మజ్జిగను అందజేశారు.

నవధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ

ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): ప్రతి మహిళా తమ ఇంటి వద్ద పెరటి తోటలు ప్రకృతి సిద్ధంగా పెంచుకుని వాటిని ఆహారంగా తీసుకోవాలని డీఆర్‌డీఏ ఏపీఎం శ్రీనివాస్ అన్నారు. ఉత్తరచిరువోలులంక గ్రామంలో నవధాన్యాల సాగు, ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. అయన మాట్లాడుతూ ప్రతి మహిళా 32 రకాల విత్తనాల నవధాన్యాలు మీ పొలాల్లో చల్లుకోవాలని, అలా చల్లడం వల్ల భూసారం పెరిగి భూమి ఆరోగ్యంగా ఉంటుందని చెప్పారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ వాణి, సిబ్బంది బుజ్జమ్మ, మండల యూనిట్ ఇన్‌చార్జి పి. నరసింహారావు, వీఓఏ బి. వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

● ఉషోదయం..



ఉషోదయ వేళ సముద్రంపై నుంచి వీచే చల్లని గాలులు.. సూర్యుని లేలేత కిరణాలు మదిని తాకుతుంటే అదో మధురానుభూతి. మంగళవారం ఉదయం మంగినపూడి బీచ్‌కి చేరుకున్న పర్యాటకులు, నగరవాసులు అలాంటి మధురానుభూతిని పొందారు. చల్లని గాలులు వీస్తుండగా సూర్యోదయం వేళ బీచ్‌లో స్నానాలు చేస్తూ వారు ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ